డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్‌కు సీఎం నివాళి



హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు, భారత దేశ తొలి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుష్పాంజలి ఘటించి, నివాళి అర్పించారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, కాంగ్రెస్ నాయకులు అద్దంకి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.



తన మనవడి వివాహానికి హాజరుకావాల్సిందిగా కోరుతూ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఎమ్మెల్సీ మహమూద్‌అలీ దంపతులు. చిత్రంలో ఎమ్మెల్యే కేటీఆర్ తదితరులు

మైటోకాండ్రియా పనితీరుపై ప్రొటీన్స్ ప్రభావం

సీసీఎంబీ పరిశోధనల్లో వెల్లడి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఒకే తరహా ప్రొటీన్ కణజాలం ఒకేలా పనిచేసినప్పటికీ, మైటోకాండ్రియాలోని ప్రొటీన్ పనితీరును అందులో ఉన్న లిపిడ్స్ ప్రభావం చూపుతాయని సీసీఎంబీ పరిశోధనల్లో వెల్లడయింది. సెంటర్ ఫర్ మాలిక్యులర్ బయాలజీలో డాక్టర్ స్వాతి రాయ్‌చౌదరి పరిశోధనలో వెలుగులోకి వచ్చిన అంశాలు నేచర్ కమ్యూనికేషన్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. మొక్కలు, జంతువుల్లో శ్వాస క్రియలో మైటోకాండ్రియా కణాల లోపల ఉన్న పొరల్లో రసాయన ప్రక్రియ జరుగుతుంది. ఇది జీవుల మనుగడకు కీలకం. మైటోకాండ్రియా లోపలి పొరల్లో కీలకమైన కార్డియోలిపిన్ పరిశీలించిగా నిర్మాణాల్లో తేడాలను గుర్తించారు. ఈ విభిన్న కార్డియో లిపిన్‌లు వివిధ రకాల కణాలు వేర్వేరు పరిస్థితుల్లో మనుగడ సాగించేందుకు సహకరిస్తాయని డాక్టర్ స్వాతి రాయ్‌చౌదరి బృందం పరిశోధనల్లో తేలింది.



బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

మాదిగ అమరుల త్యాగాల మీద మందకృష్ణ భోగాలు

● టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ

బర్కత్‌పుర, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అమరుల త్యాగాల పునాదుల మీదనే మందకృష్ణ మాదిగ భోగాలు అనుభవిస్తున్నారని టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ఆరోపించారు. 30ఏళ్ల వర్గీకరణ ఉద్యమంలో అమరుల కుటుంబాలను మందకృష్ణ ఏనాడూ పరామర్శించలేదని విమర్శించారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో.. వర్గీకరణ ఉద్యమ అమరుల కుటుంబసభ్యులు మునుగు అంజయ్య, ఇందిరమ్మ, నడిమోది కావేరి, పొన్నాల యాదయ్యలతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అగ్రకుల నేతల ఇళ్లలో పెళ్ళిళ్లు, చావులకు వెళ్లే సమయం ఉన్న మందకృష్ణకు అమరుల కుటుంబాలను పరామర్శించే సమయం లేదా అని ప్రశ్నించారు. ఆయన బీజేపీతో కుమ్మక్కై ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధంగా అమలు కాకుండా కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మార్చి 1న అన్ని జిల్లా కేంద్రాల్లో అమరుల సంస్మరణ కార్యక్రమం, మార్చి 19న హైదరాబాద్‌లో మాదిగ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమరుల కుటుంబాల్లో ఇంటికి ఒక ఉద్యోగం, రూ.50 లక్షల ఆర్థిక సహాయం చేయాలని వంగపల్లి డిమాండ్ చేశారు.

ఆధునిక సాంకేతిక వినియోగంలో తెలంగాణ జైళ్ల శాఖ రోల్ మోడల్



జైలు సూపరింటెండెంట్ శివకుమార్‌గౌడ్‌కు ఎలక్ట్రానిక్స్ గాడ్జెట్లను పంపిణీ చేస్తున్న పోలీస్ అకాడమీ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా

సైదాబాద్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక వినియోగంలో తెలంగాణ జైళ్లశాఖ రోల్ మోడల్‌గా నిలిచిందని రాష్ట్ర పోలీస్ నియామక బోర్డు చైర్మన్, పోలీస్ అకాడమీ డైరెక్టర్ వీవీ శ్రీనివాస్‌రావు అన్నారు. కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన ఇంటర్ ఆపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్(ఐసీజేఎస్)లో భాగంగా శుక్రవారం చంచల్‌గూడలోని సీకా హాల్‌లో రాష్ట్రంలోని అన్ని జైళ్లకు రూ2కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన హై టెక్నాలజీ ఎలక్ట్రానిక్ పరికరాలను జైళ్లశాఖ డీజీ డాక్టర్ సౌమ్యమిశ్రాతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఐసీజేఎస్ వ్యవస్థలో క్రిమినల్ జస్టిస్‌లో ప్రధాన స్తంభాలైన పోలీస్, కోర్టులు, జైళ్లు, ప్రాసిక్యూషన్ ఫోరెన్సిక్ ల్యాబ్‌ల డేటాబేస్‌లను డిజిటల్‌గా లింక్ చేయడం ద్వారా మరింత సమర్థవంతంగా పనిచేయవచ్చని అన్నారు. డిజిటలైజేషన్‌లో పోలీస్, జైళ్లశాఖ దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నాయని కొనియాడారు. జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ తెలంగాణ జైళ్లలో నూతన టెక్నాలజీ వినియోగంపై ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన ఆలిండియా జైళ్ల డీజీ, ఐజీల సదస్సులో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా ప్రశంసించారని తెలిపారు. కార్యక్రమంలో ఐజీ వై.రాజేష్, డీఐజీలు డాక్టర్ శ్రీనివాస్, సంపత్, జైలు సూపరింటెండెంట్లు నవాబ్ శివకుమార్ గౌడ్, రామచందర్, కళాసాగర్, సంతోష్‌రాయ్, లక్ష్మీశ్రీనాథ్, వెంకటేశం, సీకా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేంద్ర, జిల్లా, సబ్ జైలు అధికారులకు హైటెక్నాలజీ ఎలక్ట్రానిక్ పరికరాలను అందజేశారు.



ఎల్జీబీటీక్యూ హిస్టరీ మంత్ సందర్భంగా శుక్రవారం బంజారాహిల్స్‌లోని లామాకాన్‌లో లెస్బియన్, గే, బై సెక్సువల్, ట్రాన్స్, క్వీర్ వ్యక్తుల హక్కుల మీద చర్చాగోష్ఠి జరిగింది. ఈ కార్యక్రమంలో సినీ దర్శకుడు సునీల్‌కుమార్ రెడ్డి, సీనియర్ నటుడు ఎల్‌బీ శ్రీరాం, సీనియర్ జర్నలిస్టు ప్రేమమాలినితో పాటు పలువురు హక్కుల కార్యకర్తలు, రచయితలు పాల్గొని వివిధ అంశాలపై సంభాషించారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

సరూర్‌నగర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు బట్టీ చదువులకు స్వస్తి పలికి, తమలోని నైపుణ్యతతో సాంకేతిక పరిశోధనలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉన్నదని ఇండియన్ మిస్సైల్ సైంటిస్ట్, డీఆర్‌డీఎల్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ప్రహ్లాద రామారావు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో గల ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త కొత్త పరిశోధనలు, ఆవిష్కరణల ద్వారా వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, తద్వారా సమాజంలో నిరుద్యోగ సమస్యను సాధ్యమైనంత వరకు దూరం చేయవచ్చునని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ విజయా గుంటూరు, ఎస్అండ్‌హెచ్ విభాగాధిపతి ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం, సీనియర్ డీన్ ప్రొఫెసర్ వర్ధని చుండూరు, డీన్‌లు ప్రొఫెసర్ వేణుగోపాల్‌రావు, ప్రొఫెసర్ ప్రసన్నకుమార్, ఇతర విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.



సాహెబ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో నమూనాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

చిట్టి చేతుల్లో గట్టి అంశాలు..

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మీర్‌పేట్‌లోని భాష్యం లిటిల్ ఛాంప్స్ స్కూల్‌లో ఎల్‌కేజీ నుంచి 5వ తరగతి వరకు చదివే చిన్నారులు పలు సాంకేతిక అంశాలు ప్రదర్శించి అబ్బుర పరిచారు. చిట్టి చేతుల్లో చేసిన గట్టి అంశాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. సోలార్‌సిటీ, మిద్దెల మీద పచ్చని తోటలు(టెర్రాస్ గార్డెన్), తోలుబొమ్మలాట, చేనేత వస్త్రాలు, తెలుగు పండుగలు-సంప్రదాయాలు వంటి విభిన్న అంశాలను సైన్స్‌డేలో భాగంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో భాష్యం జడ్ ఈవో అంకమ్మరావు, ప్రిన్సిపాల్ స్రవంతి, శృతి, వైస్ ప్రిన్సిపాల్ సురేశ్, చిన్నారుల పేరెంట్స్ పాల్గొన్నారు.

తారామతిపేట జడ్పీహెచ్ఎస్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్ : నేషనల్ సైన్స్ డేను పురస్కరించుకుని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేట ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. ఈసందర్భంగా సుమారు 200మంది విద్యార్థులు ఈ సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొన్నారు. వివిధ రకాల సైన్స్ నమూనాలను తయారుచేసి ప్రదర్శించారు. అద్భుత నమూనాలను రూపొందించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలతో పాటు మెమెంటో, మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు ఎర్రయ్య, మహిపాల్ కరంటోత్, రమేశ్‌రావు, యాదమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ త్రివేణి స్కూల్‌లో..

సైదాబాద్ : జాతీయ సైన్స్ దినోత్సవాలను చంపాపేటలోని శ్రీ త్రివేణి స్కూల్‌లో శుక్రవారం ఘనంగా జరిగాయి. విద్యార్థులు విజ్ఞానపరమైన 200కి పైగా సైన్స్, గణితావిష్కరణలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ 1928 ఫిబ్రవరి 28న రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరించిన సందర్భంగా అదే రోజును భారత ప్రభుత్వం జాతీయ సైన్స్ దినోత్సవంగా ప్రకటించిందని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శారద, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులు తయారు చేసిన నమూనాలను తిలకిస్తున్న హెచ్ఎం ప్రసాద్

వనస్థలిపురం : బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థులు రూపొందించిన పలు నమనాలు చూపరులను ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దినేష్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానం అలవర్చుకోవాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఎంచుకున్న రంగంలో రాణించాలి

విద్యార్థులు ఎంచుకున్న రంగంలో రాణించాలని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. వనస్థలిపురం పనామా చౌరస్తాలోని భాష్యం పాఠశాలలో శుక్రవారం విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన(స్టీమ్)ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన పలు నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల జోనల్ ఇన్‌చార్జి అంకమరావు, ప్రిన్సిపాల్ సుజాత, హేమంతలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి : మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. శుక్రవారం వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని వివేకానంద పార్క్, అభ్యుదయ నగర్‌కాలనీ పార్కు, పోలీస్ స్టేషన్ వెనుకాల పార్కులను సందర్శించి వాకర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అక్కడికి వచ్చిన హయత్‌నగర్ సర్కిల్-3 డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, ఎంహెచ్‌ఓ డీఈ నీలిమాలకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నేలపాటి రామారావు, అశోక్‌గౌడ్, సత్యనారాయణ, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కుట్ల నర్సింహయాదవ్, సదాశివుడు, స్వర్ణమాధవి, విద్యారెడ్డి, ఉమేష్‌గౌడ్ పాల్గొన్నారు.



మధుయాష్కీగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న పార్కు మహిళలు

ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

చంపాపేట : విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం అని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ అన్నారు. హస్తినాపురం డివిజన్ ఈదులకంటి గార్డెన్‌లో శుక్రవారం సరూర్‌నగర్ మండలం బహదూర్‌గూడ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం నల్లగొండ శ్రీనివాస్ పదవీ విరమణ సన్మానసభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మధుయాష్కీగౌడ్ హాజరై శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బుడ్డా సత్యనారాయణ, పాశం అశోక్‌గౌడ్, కాంగ్రెస్ చంపాపేట డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, నాయకులు మహేందర్‌యాదవ్, నరేష్, శ్రీనివాస్‌గౌడ్, తోకటి కిరణ్ పాల్గొన్నారు.

ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించండి

హయత్‌నగర్ : హయత్‌నగర్ వార్డ్ అండ్ డీడ్ వద్ద జాతీయ రహదారి పైన ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని స్కూల్ సీఈవో ఎబినేజర్ శుక్రవారం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. జాతీయ రహదారి విస్తరణతో పాఠశాల ముందు రోడ్డు దాటడానికి సంవత్సరం కాలంగా విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని సీఈవో మధుయాష్కీగౌడ్‌కు తెలిపారు. స్పందించిన మధుయాష్కీగౌడ్ ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫోన్‌చేసి సమస్యను వివరించారు. వెంటనే పనులు ప్రారంభించి సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది వెంకటరమణారెడ్డి, ఆనంద్, సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని రవిగౌడ్, మాజీ అధ్యక్షుడు గజ్జి శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

శివాలయంలో చోరీ

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలోని అనాజ్‌పూర్‌లోని శివాలయంలో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని హుండీలతోపాటు ఒక లైటును అపహరించుకుపోయారు. ఆలయాన్ని శుభ్రం చేసేందుకు వచ్చిన మహిళకు హుండీలు కనిపించలేదు. పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

హయత్‌నగర్ : వ్యక్తి అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీస్‌స్టేషన్ పరిధిలోని మునగనూరుకు చెందిన కోరగంజి సుధీర్‌కుమార్(31) ఫిబ్రవరి 13న ఇంట్లో వాళ్లతో గొడవపడి ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లాడు. గతంలో కూడా ఇలా చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి వస్తుండేవాడు. 15రోజులు అవుతున్నా తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో చెల్లి సంధ్యారాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆధునిక స్కల్ బేస్ శస్త్ర చికిత్స

● యువకుడి ప్రాణాలు కాపాడిన కేర్ ఆస్పత్రి వైద్యులు

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): 10నెలలుగా తల నిర్మాళ్యం(గిడ్డినెస్), వినికిడి సమస్యలతో బాధపడుతున్న 39 ఏళ్ల వల్లమల్ల రాజుకు కేర్ ఆస్పత్రి మలక్‌పేట కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ మహ్మద్ హమీద్ షరీఫ్ ఆధునిక స్కల్ బేస్ శస్త్ర చికిత్స నిర్వహించి ప్రాణాలు కాపాడారు. ఈసందర్భంగా డాక్టర్ హమీద్ షరీఫ్ మాట్లాడుతూ పేషంట్ రాజు సంప్రదించగా న్యూరో సర్జరీ, ఈఎన్‌టీ, కార్డియాలజీ విభాగాల నిపుణులతో కూడిన బృందం సమగ్రంగా పరిశీలించారు. బాహ్యంగా నిర్వహించిన స్కానింగ్‌లో ఎడమ సెఐబెల్లో పాంటైన్ ట్యూమర్ ఉన్నట్లుగా గుర్తించారు. ఈ ట్యూమర్ మెదడు, మెదడు కండరాలపై తీవ్రమైన ఒత్తిడిని కలిగిస్తుందని గుర్తించారు. వినికిడి లోపం తీవ్రంగా ఉందని నిర్ధారించారు.



పేషంట్ రాజుతో న్యూరో సర్జన్ డాక్టర్ మహ్మద్ హమీద్ షరీఫ్, వైద్య బృందం

ఇలాంటి సమస్యతో బాధపడుతున్న రాజుకు ఆధునిక ఇంట్రా ఓపరేటివ్ న్యూరో మానిటరింగ్ సాంకేతికతతో క్లిష్టమైన స్కల్ మైక్రో న్యూరో సర్జరీ బేస్ శస్త్ర చికిత్స చేసినట్లు వివరించారు. శస్త్ర చికిత్స అనంతరం ఐసీయూలో రోగిని పర్యవేక్షించగా మూడో రోజుకు పోస్ట్ ఆపరేటివ్ డ్రైన్, పోలీస్ కాథెటర్ తొలగించారు. అతని ఆరోగ్య స్థితి నిలకడగా ఉండడంతో స్కల్ బేస్ శస్త్ర చికిత్స విజయవంతమైనట్లుగా శుక్రవారం ప్రకటించారు. ఆస్పత్రి జోనల్ సీఓఓ బిజునాయర్, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

అట్రాసిటీ ఫిర్యాదు తీసుకోకపోతే అధికారిపై కేసు

● మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పి.నరేష్

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఎవరైనా కులం పేరుతో దూషించినట్లయితే వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసేందుకు పోలీస్‌స్టేషన్లకు వచ్చే ఫిర్యాదులను ఏ కారణం చేతనైనా పోలీసు అధికారులు స్వీకరించకపోతే ఆయా అధికారిపై కూడా ఇదే కేసు నమోదు చేసే అవకాశముందని మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పి.నరేష్ స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం మూసారాంబాగ్ పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు కోసం వచ్చే ఫిర్యాదులను పోలీస్‌స్టేషన్లలో తప్పనిసరిగా స్వీకరిస్తామన్నారు. అందిన ఫిర్యాదులపై తదుపరి విచారణ ఏసీపీ స్థాయి అధికారులు నిర్వహించి చర్యలు చేపడతారన్నారు.

రేషన్‌కార్డు దరఖాస్తుకు ఎక్కువ వసూలు చేస్తే చర్యలు

కొత్తరేషన్ కార్డు దరఖాస్తులకు రూ.45లను మాత్రమే వసూలు చేయాలని సైదాబాద్ తహసీల్దార్ జయశ్రీ తెలిపారు. రూ.45లకు మించి రూ.5లు అదనంగా వసూలు చేసినా ఆయా మీ సేవ కేంద్రంపై ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి సీజ్ చేస్తామన్నారు. ఈ విషయమై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి దృష్టికి కూడా వచ్చిందన్నారు. దీనిపై కలెక్టర్ ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని తహసీల్దార్ తెలిపారు. కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తుకు కేవలం రూ.45లే వసూలు చేయాలని ఇప్పటికే మీ సేవ కేంద్రాలకు ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని ఆమె వివరించారు. కార్యక్రమంలో మలక్‌పేట ఎస్ఐ సంజీవరెడ్డి, కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

యూనియన్ బలోపేతానికి సభ్యత్వ నమోదు

● టీయూడబ్ల్యూజే-ఐజేయూ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి

హయత్‌నగర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలో టీయూడబ్ల్యూజే-ఐజేయూ యూనియన్ బలోపేతం చేసేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు టీయూడబ్ల్యూజే-ఐజేయూ రాష్ట్ర కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తొర్రూర్ గ్రామంలోని శ్రీరస్తు బ్యాంకెట్ హాల్‌లో టీయూడబ్ల్యూజే-ఐజేయూ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 3లోగా జిల్లా యూనియన్ సభ్యత్వ నమోదు ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం జిల్లా మహాసభలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈ మహాసభల సందర్భంగా జిల్లాలో జర్నలిజం వృత్తిలో 25సంవత్సరాలు పూర్తి చేసుకున్న జర్నలిస్టులకు ప్రత్యేకంగా సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయా నియోజకవర్గాలకు సంబంధించిన జిల్లా కమిటీ బాధ్యులు, ఆయా ప్రెస్‌క్లబ్‌ల అధ్యక్షులు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. జిల్లా బాధ్యులు సమిష్టిగా కృషి చేసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపర్తి ప్రవీణ్‌కుమార్, మఫిసిల్ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గుడిపల్లి శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, జాతీయ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సలీమ్‌పాష, సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కటకం సుభాష్, ప్రసాద్, సంయుక్త కార్యదర్శులు జగన్‌గౌడ్, రాజేష్, కోశాధికారి సంరెడ్డి శశిపాల్‌రెడ్డి, కార్యవర్గసభ్యులు పాండు, వెగ్గలం శ్యాం, బద్దుల మల్లేష్‌యాదవ్, దర్శనం జంగయ్య, రచ్చ శేఖర్, ఆవంచ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



టీయూడబ్ల్యూజే-ఐజేయూ జిల్లా కార్యవర్గ సమావేశంలో శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు



ప్రభుత్వ బాలికల వసతి గృహానికి వాటర్ ప్యూరిఫయర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

సమస్యలు పరిష్కరిస్తా : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఎలాంటి సమస్య తలెత్తినా తన దృష్టికి తీసుకుస్తే వెంటనే వాటిని పరిష్కరిస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మన్సూరాబాద్ డివిజన్ చిత్రసీమ కాలనీలోని ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని శుక్రవారం ఆయన సందర్శించి తనవంతుగా వాటర్ ప్యూరిఫయర్‌ను అందజేశారు. అనంతరం హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను విద్యార్థులు, సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, నాయకులు జగదీశ్‌యాదవ్, నాగరాజు, జక్కిడి రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ పనులను చేపట్టండి

మన్సూరాబాద్ : నాగోల్ డివిజన్ రాక్‌టౌన్‌కాలనీలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని రాక్‌టౌన్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది. అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లోని తన కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సెక్రటరీ జైపాల్‌రెడ్డి, సంజీవరెడ్డి, మాజీ అధ్యక్షుడు రాంరెడ్డి, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలి

వనస్థలిపురం : అగ్నిప్రమాదాలు జరగకుండ కాలనీవాసులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ శారదానగర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు బహిరంగ ప్రదేశాల్లో వేసిన చెత్తకు శుక్రవారం నిప్పుఅంటించారు. దీంతో పక్కనే ఉన్న ఎండిపోయిన చెట్లకు, గడ్డికి అంటుకుని స్వల్పంగా మంటలు ఎగిసి వస్తున్నాయని కాలనీవాసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పివేశారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకుని అగ్నిప్రమాదంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

జిల్లా కోర్టుల్లో డిజిటలైజేషన్ సెంటర్ ప్రారంభం

రంగారెడ్డి జిల్లా కోర్టులు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన డిజిటలైజేషన్ సెంటర్‌తో పాటు విట్‌నెస్ డిపోజిషన్ సెంటర్‌ను తెలంగాణ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజోయ్‌పాల్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం రాజేంద్రనగర్, చేవెళ్ల కోర్టులను డిజిటల్ ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి, హైకోర్టు జడ్జి జస్టిస్ శ్యాంకోషి, హైకోర్టు జడ్జిలు జస్టిస్ మౌషుమి భట్టాచార్య, జస్టిస్ వినోద్‌కుమార్, జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ విజయసేన్‌రెడ్డి, జిల్లా జడ్జి శశిధర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉర్దూమీడియం పాఠశాలలో కరాటే పోటీలు

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉర్దూమీడియం ఉన్నత పాఠశాలలో నిర్భయ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 23మంది బాలికలు పాల్గొన్నారు. పోటీల్లో సాజియా ఎలిమి ప్రథమస్థానం, సబాతబుసం ద్వితీయ స్థానం, తస్నీర్‌ఫాతిమా తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రమావత్ తావురియానాయక్‌లు మెడల్స్ ప్రదానం చేశారు. అనంతరం కరాటే మాస్టర్ ఎండీ ఇసాంను ఘనంగా సత్కరించారు.

చెత్తను తొలగించడంలో శానిటేషన్ అధికారుల తీరు సహించరానిది : లచ్చిరెడ్డి

వనస్థలిపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): చెత్తను తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న శానిటేషన్ అధికారుల తీరు సహించరానిదని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్‌లో శానిటేషన్ అధికారులు, పారిశుధ్య కార్మికులు చెత్తను తొలగించడంలో అలసత్వం వహిస్తున్నారని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఎన్జీవోస్ కాలనీలో బీజేపీ శ్రేణులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బొమ్మ రఘురామ్‌నేత, శ్రీధర్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, మహేష్‌గౌడ్, శరత్‌కుమార్ పాల్గొన్నారు.

మూగజీవుల దాహార్తిని తీరుద్దాం

మన్సూరాబాద్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): వేసవి కాలం నీటి కొరత దృష్ట్యా అందరం కలసికట్టుగా మూగజీవుల దాహార్తిని తీర్చేందుకు పాటుపడదామని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. మూగజీవుల దాహార్తి తీర్చేందుకు జీహెచ్ఎంసీ వెటర్నరీ సిబ్బంది ఆధ్వర్యంలో మన్సూరాబాద్ కాస్మోపాలిటన్ కాలనీలో శనివారం ఇంటింటికీ తిరిగి అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నర్సింహారెడ్డి పాల్గొని వేసవి కాలం దృష్ట్యా ప్రతి ఇంటి బయట మూగజీవుల దాహార్తి నిమిత్తం బకెట్‌లో నీటిని ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వెటర్నరీ సిబ్బంది, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ సమస్యలను పరిష్కరించండి

వనస్థలిపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని సర్వే నం.201/1లోని బీఎన్‌రెడ్డినగర్, ఎస్కేడినగర్, శ్రీరామ్‌నగర్, బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్-3లోని కాలనీలకు రిజిస్ట్రేషన్ సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి కోరారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు అరవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కలిసి శుక్రవారం సైఫాబాద్‌లోని అరణ్యభవన్‌లో డీఎఫ్‌ఓ సుధాకర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలు కాలనీల సంక్షేమ సంఘం అధ్యక్షులు పురుషోత్తంరెడ్డి, అమరేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పోగుల రాంబాబు, ప్రదీప్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.